క్లుప్తంగా

కొలతల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కల్లూరు: ఉపాధి కూలీలు నిర్దేశిత కొలతల మేరకు పనిచేస్తే రోజుకు గరిష్ట వేతనం రూ. 272 పొందవచ్చని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు.ఆయన గురువారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయ న మాట్లాడు తూ.. కూలీలందరూ సమయ పాలన పాటించాలని, ఎండల తీవ్రత ఎక్కువ గా ఉండడంతో ఉదయం త్వరగా వచ్చి పను లు పూర్తి చేసుకుని త్వరగా వెళ్లాలన్నారు. ఈసీ మధుసూదన్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

గరిష్ట వేతనం పొందేలా పని చేయండి

సి.బెళగల్: ఉపాధి కూలీలు దినసరి గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులు చేపట్టాలని మండల ఉపాధి హామీ ఈసీ పృథ్వీ సూచించారు. ఆయన గురువారం కొత్తకోట, ఇనగండ్ల గ్రామాలలో పర్యటించి అక్కడ జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరును పరిశీలించి మస్టర్ సమర్థవంతంగా నిర్వహించేందుకు మేటీలకు సూచనలు చేశారు. పని ప్రాంతంలో కూలీలకు అందాల్సిన సేవలు, వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని టీఏలను ఆదేశించారు. గ్రామాలలోని రైతులు ఉద్యానవన పంటల సాగుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం మునగ, పండ్ల తోటల పెంపకాలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈసీ వివరించారు. టీఏలు, ఎఫ్ఏలు, మేటీలు వెంట ఉన్నారు.

కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయండి

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ మాధవీలత కాంట్రాక్టర్లకు సూచించారు.కె.నాగలాపురంలోని సచివాలయం, ఆర్‌బీకే భవనాల నిర్మాణాలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..భవనాల నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు.పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కె.నాగలాపురంలో సచివాలయ భవన నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉందని, ఆర్‌బీకే భవన పనులు 80 శాతం పూర్తయినట్లు ఆమె తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని, మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు



తెగిన విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

గడివేముల: మండల కేంద్రంలో గురువారం వీచిన ఈదురుగాలులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఉన్న భారీ వృక్షం నేలకూలింది. దాదాపు 30 ఏళ్ల చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. చెట్టు కొమ్మలు తగిలి స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కోలుకోలేక మున్సిపల్ కార్మికుడి మృతి

కర్నూలు: అనారోగ్యం బాధ తాళలేక క్రిమిసంహారక మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడుగా పనిచేస్తున్న గోపి (30) మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండేవాడు. ఈనెల 9వ తేదీన ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో కోలుకోలేక గురువారం మృతిచెందాడు. భార్య శాంతి ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఓల్డ్‌సిటీలోని మాసుంబాషా దర్గా సమీపంలో మున్నా అనే వ్యక్తికి చెందిన ఆటోను తగలబెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని ఏపీ ఆటో ట్రాలీ అండ్ ఫోర్ వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి సమయంలో తాగుబోతులే ఆటోను తగలబెట్టి ఉంటారని, వారిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

తోటల్లోనే మగ్గుతున్న పూలు

- డిమాండ్ ఉన్నా కూలీల కొరత
- మిరప గ్రేడింగ్‌కు వెళ్తున్న కూలీలు



చెట్టుపైనే వాడుతున్న మల్లెపూలు

పాణ్యం: ఎలాంటి శుభకార్యమైనా ముందుగా విరబూసిన తాజా పూలతో స్వామివారిని పూజించడం ఆనవాయితీ. అన్ని మతాల వారు స్వామిపూజలో పూలను వినియోగిస్తుంటారు. అయితే మండలంలో కూలీల కొరత కారణంగా విరబూసిన పూలన్నీ చెట్లపైనే వాడుముఖం పడుతున్నాయి. పూలను తెంపేందుకు కూలీలు రాకపోవడంతో రైతులు పూల తోటలను అలాగే వదిలేస్తున్నారు. మండలంలో అధికంగా మిరప సాగు చేయడం, దిగుబడులను గ్రేడింగ్ చేసేందుకు కూలీలు అధిక సంఖ్యలో అవసరమడంతో అదనంగా డబ్బులు చెల్లించి కూలీలను తీసుకెళ్తున్నారు. దీంతో పూలు తెంచేందుకు కూలీలు కరువయ్యారు. గత రెండు నెలల నుంచి ఈ సమస్య ఏర్పడింది. మండలంలో కనకాంబరం, మల్లె, జాజిపూలు, గులాబీ తదితర పూలను సుమారు 30 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వీరిలో అధికంగా తక్కువ విస్తీర్ణంలో సాగు చేసే రైతులే ఉన్నారు. పూల సాగు కోసం రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి వెచ్చించారు. ప్రస్తుతం వివాహాలు, ఇతర శుభకార్యాలు ఉండడంతో పూలకు డిమాండ్ ఉంది. అయితే తోటల్లో పూలు తెంచేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఒక వైపు ఈదురు గాలులు, అకాల వర్షం, కూలీల కొరతతో పూలను చెట్లపైనే వదిలేస్తున్నారు.

కూలీలకు డిమాండ్

మార్కెట్‌లో మిరప ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు దిగుబడులను గ్రేడింగ్ చేసేందుకు కూలీల కోసం చూస్తున్నారు. కూలీల కొరత కారణంగా డోన్, వెల్దుర్తి, బేతంచెర్లతో పాటు ఇతర మండలాల నుంచి అదనంగా డబ్బు ఇచ్చి గ్రేడింగ్ చేయించుకున్నారు. ఒకరికి సాధారణ కూలి రోజుకు రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.350 వరకు చెల్లిస్తున్నారు. దీంతో పెద్దలతో పాటు పిల్లలు కూడా మిరప గ్రేడింగ్ చేసేందుకు వెళుతున్నారు.దీంతో పూలు కోసేందుకు కూలీల సమస్య తీవ్రంగా ఉంది. ఒక రోజంతా పూలు తెంచేందుకు వెళ్తే కూలి రూ.200 వరకు వస్తుంది. అది కూడా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పని చేయాల్సి ఉంటుది. దీంతో అదనంగా సొమ్ము ఇస్తామన్న కూడా కూలీలు రావడం లేదని రైతులు చెబుతున్నారు. చేసేది లేకకుటుంబ సభ్యులతోనే పూలు తెంచుతున్నామని, వచ్చిన పూలనే విక్రయిన్నట్లు చెప్పారు.

కూలీల సమస్య తీవ్రంగా ఉంది



నేను అర ఎకరంలో మల్లెపూలు సాగు చేశారు. చెట్లకు పూలు బాగా పూశాయి. ప్రస్తుతం కోత దశలో ఉండడంతో ప్రతి రోజు పూలు తెంచేంఉదకు ఐదారుగురు కూలీల అవసరం ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూలు తెంచేందుకు కూలీలు ఉండాలి.అయితే గత రెండు నెలల నుంచి కూలీల సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కువ మంది కూలీలు మిరప గ్రేడింగ్ పనులకు వెళుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులమే పూలు తెంపుతున్నాం. వాటినే విక్రయిస్తున్నాం, మిగతావి పొలంలో అలాగే వదిలేస్తున్నాం. దిగుబడి ఉన్నప్పటికీ కూలీల సమస్య కారణంగా పూర్తిస్థాయిలో విక్రయించలేకపోతున్నాం.

– బురినేని సునీల్, రైతు

నర్సింగ్ కోర్సులో ఉచిత ప్రవేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ తదితర పేద వర్గాలకు చెందిన బాలికలకు నర్సింగ్ కోర్సులో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు జేపీ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కృష్ణానగర్‌లోని సొసైటీ ఫర్ హోలీ పవర్ ఆధ్వర్యంలో కళాశాల కొనసాగుతుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశం పొందిన వారికి ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 96031 68772, 98483 52725 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

14న బాలికల క్రికెట్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సీనియర్స్, అండర్-23, అండర్-19, అండర్-15 విభాగంలో జిల్లాస్థాయి బాలికల క్రికెట్ జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. 2008 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

నేటి నుంచి గిడ్డాంజనేయస్వామి ఉత్సవాలు



కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు శుక్రవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, 13వ తేదీ శనివారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అలంకరణ అర్చన, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, గ్రామోత్సవంలో భాగంగా ప్రభోత్సవం, 14వ తేదీ ఆదివారం గిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజల నంతరం సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రథోత్సవం సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీఓ



ఎర్రదొడ్డిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: మండలంలోని అనుగొండ, ఎర్రదొడ్డి గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్ పర్యటించి ఉపాధి పనులను, గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఎర్రదొడ్డి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ.. గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పథకం కింద పనులు కల్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.272 వేతనం లభిస్తుందన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలందరికీ పనులు కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అనుగొండ గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు, గ్రామాల్లో జరుగుతున్న ఎస్‌డీజీ, బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వేలపై ఆరా తీసి త్వరగా పూర్తి చేయాలని వలంటీర్లు, సిబ్బందికి సూచించారు.

కౌలుకార్డులతో బహుళ ప్రయోజనాలు



బురాన్‌దొడ్డిలో కౌలు కార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: పంట భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డుల (సీసీఆర్‌సీ)తో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏఓ మల్లేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన గురువా రం మండలంలోని బురాన్‌దొడ్డి, చింతమానుపల్లె వ్యవసాయ అధికారులు, ఉద్యోగులతో కలిసి గ్రామ సభ నిర్వహించి ఆయా గ్రామాల రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. కౌలుకు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని, బ్యాంకుల నుంచి రుణాలు, సబ్సిడీ పథకాలకు అర్హత పొందుతారని తెలిపారు. భూ యాజమానికి ఎలాంటి ఇబ్బంది, నష్టం ఉండదని వివరించారు. స్థానిక వీఆర్వోలు పాండురంగయ్య, సాయి రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు మారెప్ప, ప్రవీన్, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సూచించారు. ఆయన గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు మూడు రోజులుగా గాలి, వర్షాలు ఉంటున్నాయని, వీటి వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా గాలికి బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫీడర్ డౌన్ వంటి సమస్యలు తెలుత్తుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

14న లాసెట్ మోడల్ పరీక్ష

కర్నూలు(లీగల్): ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ఉచితంగా మోడల్ లాసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీనయ్య సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నాగరాజు యాదవ్ తెలిపారు. కర్నూలులో ఎన్‌ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ హైస్కూల్లో ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు మోడల్ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ఎం.వి.చక్రపాణి – 94413 00262, వి.శ్రీరాములు – 70133 72238 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డార్విన్ సిద్ధాంతం కొనసాగించాలి

కర్నూలు సిటీ: నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పాఠ్య పుస్తకాల్లో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప అన్నారు. గురువారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చరిత్ర పాఠ్యంశాలలో మొఘల్ సామ్రాజ్యం, ప్రజాస్వామ్య ఉద్యమాలు, హక్కులు తదితర వాటిని తొలగిస్తున్నారన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సంఘం నాయకులు బజారప్ప, రత్నం ఏసేపు, షూఖూర్, భీషన్న, మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- నూతనపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం



నూతనపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం కర్నూలు మండలం నూతనపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారని కొనియాడారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గుర్తించి పథకాలు వర్తింపజేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ మాత్రమేనని కొనియాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగనన్నను ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, నాయకులు మహబూబ్‌బాషా, లక్ష్మీదేవి, కృష్ణ, మధు, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

గడివేముల: ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు స్థానిక ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి హేమసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం గడివేముల ఆర్బీకేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..విత్తనాలు, ఎరువులు కావలసిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు ఆర్బీకే, వ్యవసాయ సిబ్బంది సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

'విద్యాకానుక' పరిశీలన



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ విజయప్రసాద్

కోడుమూరు: మండలానికి మంజూరైన జగనన్న విద్యాకానుకలను ఐఈఆర్‌టీ, సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ విజయప్రసాద్ పరిశీలించారు. గురువారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుకలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థినులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. కో–ఆర్డినేటర్ వెంట ఎంఈఓ అనంతయ్య ఉన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబైన ఆలయం

కోడుమూరు రూరల్: మండలంలోని కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయ స్వామి, గణపతి, నవగ్రహ, గంగమ్మ, నాభిలింగ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు భక్తబృందం సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రాతకాల పూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, మండపారాధన, యంత్ర విగ్రహ అభిషేకాలు, ప్రదోశపూజ, దీక్షాహోమం, 13న శనివారం గ్రామోత్సవం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, చెక్క భజన, 14న ప్రతిష్ఠహోమం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమనంతరం సీతారాముల వారి కల్యాణ మహోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదానం చేపట్టనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సర్వే సకాలంలో పూర్తి చేయండి



సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: ప్రభుత్వం సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం మండలంలోని కొంగనపాడు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్, జగనన్నకు చెబుదాం, స్పందన, జాబ్ కార్డు ఉన్నవారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. గ్రామంలో మహిళల ఆరోగ్య పరిస్థితి, ఐఎఫ్ఏ–ట్యాబ్‌లెట్స్, ఇళ్ల నిర్మాణాల సర్వేలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు ఫేజ్–2 పనులు పరిశీలించారు. పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతిరోజు పాఠశాలలకు హాజరుకావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జున, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాట్య మయూరి

- శాస్త్రీయ నృత్యంలో రాణిస్తున్న హర్షిత
- పలు జాతీయ స్థాయి పురస్కారాలు
- కూచిపూడిలో నంది అవార్డు కైవసం



నృత్య ప్రదర్శన ఇస్తున్న మల్లారి హర్షిత

కర్నూలు కల్చరల్: చిన్నతనంలో వెస్ట్రన్ డ్యాన్స్ స్టెప్పులు వేయడం, డ్యాన్సర్లను అనుకరించడం గమనించిన తల్లిదండ్రులు ఆ చిన్నారిని శాస్త్రీయ నృత్యంపై ప్రోత్సహించారు. నిపుణులైన గురువుల వద్ద కూచిపూడి, భరత నాట్యంలో శిక్షణ ఇప్పించారు. కర్నూలులోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో కూచిపూడి నృత్యంలో నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు డిప్లొమాలో ద్వితీయ సంవత్సరంలో ఉన్నారు మల్లారి హర్షిత. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఫైనల్ ఇయర్ డిప్లొమా చదువుచున్న హర్షిత కూచిపూడి, భరతనాట్యంలో జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు కూచిపూడిలో నంది అవార్డును సొంతం చేసుకున్నారు.

హర్షిత కుటుంబ నేపథ్యం

హర్షిత తల్లిదండ్రులు ఎం.శిరీష (గృహిణి), ఎం.రాఘవేంద్ర (బీఎస్ఎన్ఎల్, ఎస్‌డీఈ). వీరు కర్నూలు ఎన్నార్ పేటలో నివాసం ఉంటున్నారు. కూచిపూడిలో గురువు నాగసాయి ప్రదీప్ వద్ద, భరత నాట్యంను గురువు ప్రతిమ సునీల్ (మార్కాపురం)వద్ద శిక్షణ పొందారు. కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ప్రథమస్థానంలో నిలిచారు. ఏ రంగంలో స్థిరపడ్డా శాస్త్రీయ నృత్యాలను జీవితంలో ఒక భాగంగా చేసుకొని కొనసాగించడంతో పాటు ఇతరలకు నేర్పించాలన్నదే తన లక్ష్యమని హర్షిత అభిప్రాయం వ్యక్తం చేశారు.



సాధించిన పథకాలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో హర్షిత

ఇచ్చిన ప్రదర్శనలు.. అందుకున్న ప్రశంసలు

- 2016లో సిలికాన్ ఆంధ్ర వారు నిర్వహించిన 5వ అంతర్జాతీయ కూచిపూడి డ్యాన్స్ కార్నివాల్‌లో పాల్గొన్న 6,117 మందిలో హర్షిత ప్రదర్శన ఇచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు.
- 2018లో ఓటర్స్ డే సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు.
- 2021లో యువజన సాంస్కృతిక శాఖ, సెట్కూరు వారు నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో జిల్లాస్థాయిలో భరతనాట్యంలో మొదటి స్థానం, కూచిపూడిలో ద్వితీయ స్థానంలో నిలిచారు.
- 2022లో యువజన సాంస్కృతిక శాఖ సెట్కూరు వారు గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో భరత నాట్యంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు.



మంత్రి రోజా చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న దృశ్యం

- హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన ఇండియన్ క్రాఫ్ట్ మేలాలో ఉత్తమ ప్రదర్శన
- హంపీలో నిర్వహించిన నేషనల్ డ్యాన్సింగ్ కార్నివాల్‌లో కూచిపూడి ప్రదర్శనకు గాను నంది అవార్డు కైవసం చేసుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఉగాది మహోత్సవాల్లో 2017, 2018, 2019 సంవత్సరాలలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులచే ప్రశంసలు అందుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి వారు తిరుపతిలో నిర్వహించిన జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో అత్యుత్తమ ప్రతిభతో మంత్రి రోజాచే ప్రశంసలు అందుకున్నారు.
- సంక్రాంతి సంబరాలు, తుంగభద్ర పుష్కరాలు, శ్రీశైలం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో దేవస్థానం వారు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మన్ననలు అందుకున్నారు.